

# రంగడి అంతరంగం

సోమంచి రామం

"ఆ ముసలమ్మ పక్కసీట్లో సర్దు 'కూర్చో!......" అంటూ టిక్కెట్టూ, యిరవై పైసలూ రంగడి చేతిలో పెట్టి, ముందుకు దారి చూపించాడు కండక్టరు రంగడికి. అప్పటికే బస్సు దాదాపు నిండిపోయింది. రంగడు ఆ టిక్కెట్టును, యిరవై పైసల్ను జేబులో వేసికొని, దారిలో ఉన్న పాల బిందెల్ని, తట్టల్ని దాటుకుంటూ పోయి, ఆడవాళ్ళ సీటులో ఒకే ఒక్క ఖాళీ ముసలమ్మ ప్రక్క నుంచే. వెళ్ళి కూర్చున్నాడు. బస్సు బయలుదేరడానిక్కి యింకా పదినిముషాలు వ్యవధి ఉంది. పధ్నాలుగేళ్ళ రంగడు భయం భయంగా ఒక్కసారి బస్సంతా కలియ చూశాడు, తన నెరుగున్నవాళ్ళెవరైనా చూస్తున్నారేమో నన్న భయంతో!—ఈ బస్సు త్వరగా బయలుదేరిపోతే బాగుండు నని ఉంది వాడి మనస్సులో. ఇదే బస్సులో యింతకు పూర్వం ఎన్నోసార్లు ప్రయాణం చేశాడు...సెలవలకు యింటికి వెళ్ళే

టప్పుడు అతని మనస్సు Express బస్సు వేగంకన్న జోరుగా ఆనందంతో ఉరకలు వేస్తూ పరుగులెత్తేది. సెలవల నుంచి తిరిగి యీ బస్సులోనే మళ్ళీ రావల్సి వచ్చేటప్పుడు Overtime duty యిష్టం లేకుండా చేస్తున్న వానిలా నీరసంగా, విచారంగా ఉండేది అతని మనస్సు కాని ఈసారి రంగడి మనస్సు ఆ రెండు రకాలుగాను లేదు. ఎందుకో భయం భయంగా ఉంది. ఎంత త్వరగా ఎరుగున్న వాళ్ళ కంట బడకుండా, ఈ బస్సు బయలుదేరిపోతే అంత బాగుంటుందని ఆందోళన పడ సాగాడు. బెరుకు బెరుకుగా చుట్టూ కలియచూశాడు మళ్ళీ! తన ముందు సీట్లో ఒక పెద్దమనిషి, చక్కగ ఇస్త్రీ చేసిన తెల్లని పాంటు, తెల్లని చొక్కా Tug up చేసికొని కూర్చున్నాడు... తనకూ అలాంటి తెల్లటి బట్టలు తొడుక్కోవాలని ఎన్నాళ్ళనుంచో కోరిక — ఎంతో సరదా!...ప్చ్!...ఏం లాభం? ఎన్నాళ్ళు తొడగాలో ఈ నిక్కర్లు?

ఇంకో సీట్లో ఎవరో కాలేజీఅమ్మాయిలా ఉంది!...రెండు జెళ్ళు వేసి కొని, కళ్ళకు జోడు కూడా పెట్టుకుంది....చ్చం పోలిక చూస్తే వాళ్ళ వదినలా కనపడింది ... అమ్మో!... వదిన తలపుకు రాగానే రంగడి ఒళ్లు ఝల్లుమంది! వెంటనే దృష్టి అటు ప్రక్కనుంచి త్రిప్పేశాడు.

"ఏయ్! లె...లే...లేవయ్యా!... తెల్లారి గంటయిపోయినా యింకా ఏమిటీ నిద్ర? మీద పడ్తూ," అంటూ ఒకాయన తనమీద పడుతున్న ముసలాయన్ని నిద్ర లేపుతున్నాడు ఆ ముసలాయన్ని చూస్తే వాళ్ళ ఊళ్ళో మునసబు ముసలయ్య గుర్తుకొచ్చాడు రంగడికి. ఆశ్చర్యం! ఇద్దరిదీ ఒకే పోలిక! మనుషులను పోలిన మనుషులు ఉంటూనే ఉంటారు కాబోలు! రాత్రి తెల్లవార్లూ సినిమా చూసినట్టున్నారు కొందరు!...ఇంకో సీట్లో నిద్రపోతూ తూలుతున్నారు!...వాళ్ల చేతుల్లో "ఆత్మగౌరవం" సినిమా పుస్తకాలున్నాయి. సినిమా చూడితే తనకూ సినిమా పుస్తకం కొనాలని ఉంటుంది! తాను చాల బాగా పాడతాడని అంటుంది వాళ్ళ ఊళ్లో రాజమ్మత్తగారి రాధ! ఏమో, దాని కెలా తెలిసిందో!...తా నెప్పుడూ ఎక్కడా మరి పాడనేలేదు! స్కూళ్ళో మేష్టారి ప్రశ్నలకు జవాబులు చెప్పుతేనే అర్థం కావటంలేదు మేష్టారు! తన గొంతుకలో ఏదో లోపం ఉందన్నా రాయన! మరి రాధ తను బాగా పాడుతానంటుంది!...ఏమిటో మరి

బస్సు డోరు ధడాల్న వేసిన శబ్దం, రైట్ అన్న కండక్టరు అర్డరు రెండూ ఒక్కసారే జరగడంతో బస్సు ఒక్కసారి కదిలింది. 'హమ్మయ్య!' అను

కుంటూ గట్టిగా శ్వాస పీల్చాడు రంగడు. ఓ పెద్ద బరువుని తన తల మీద నుంచి క్రిందకు దించినట్లు హాయి ననుభవించాడు. ఇక తనకు వదిన బాధ ఉండదు. ఆవిడగారి తమ్ముడి అథార్టీ ఉండదు. లేకపోతే ప్రతి పనికీ తనేనా! అన్నయ్య ఆఫీసుకి కాఫీ పట్టుకెళ్ళమంటే పట్టుకెళ్ళవచ్చును! వదిన పిల్లాడ్ని ఎత్తుకోమంటే ఎత్తుకోవచ్చును! పంపునించి మంచినీళ్ళు తెమ్మన్నా తేవచ్చును! ఇంకా ఇలా ఎన్నెనాం చిన్నచిన్న పనులు చేయవచ్చును; కాని ఆయనగారు – వదిన తమ్ముడు – చదివేది P. U. C. పెద్ద డాక్టరీ చదువుకన్నా ఎక్కువ షోకు అవుతాడు. ఆయనగారికి లాండ్రీ నుంచి బట్టలు తెచ్చేది తానే! ... బూట్లు పాలిష్ చేసే సామాను అందించేది తానే. ఇంకా నయం–వీలుంటే బూట్లుకూడా పాలిష్ చేయమంటాడు

"ఇంకా ఎవరన్నా టిక్కెట్టు తీసికోవాలా బండిలో–" అంటూ అరుస్తున్నాడు కండక్టరు ... ఎవ్వరూ మాట్లాడడం లేదు...ఎవరి గొడవల్లో వాళ్ళున్నారు.

"నాగేస్రావు యాతను కన్న కాంచనది బాగుందెహా!" అంటున్నాడు పక్క సీట్లో కూర్చున్న వాళ్ళల్లో ఒకడు...వాడు ఎంచక్క రాత్రే ఆత్మగౌరవం సినిమా చూసినట్టున్నాడు. ఆత్మగౌరవం ఎంత పెద్ద మాట!...నిజంగా తనకీ ఆత్మగౌరవం ఉంది! అందుకనే అనవసరంగా ఎవరి చేతా మాట పడదల్చుకోలేదు...లేకపోతే తేరగా ఉన్నాననా తన మీద దొంగతనం కట్టారు. ముష్టి మూడు రూపాయలు తను తీస్తాడా!...అందులోనూ వదిన పెట్లోది...వదిన సొమ్ము తను ముట్టుకుంటాడా?... అంతగా అవసరమయితే అన్నయ్య నడిగి తీసికొంటాడు గాని!

"ఏమయ్యా! ఇంకా బస్సులో టిక్కెట్టు తీసికోవాల్సింది ఎవరంటే మాట్లాడరేం?" అంటూ గట్టిగా అరిచాడు కండక్టరు ఇంకోసారి. ఈసారీ ఎవరూ మాట్లాడలేదు. దాంతో కండక్టరు వళ్ళు మండి, తాడు లాగి బెల్లు మోగించాడు. ఎందుకు ఆపాలో అర్థం చేసికొన్నాడు గాబోలు ఆ డ్రైవరు– సైడుకు తీసి చెట్టు నీడన ఆపాడు బస్సుని!

"మీ టిక్కెట్టు ఏది? ఎందాక?" అంటూ కండక్టరు అందరి టిక్కెట్లు చూసుకొస్తున్నాడు.

"ఏం? ఏం జరిగింది? టిక్కెట్లు మిస్ అయాయా?" అన్నాడు తెల్ల పాంటూ, చొక్కా వేసికొన్న పెద్ద మనిషి!

"ఓ టిక్కెట్టు తేడా వస్తోంది


సార్! బండిలో 35 మంది ఉన్నారు. టిక్కెట్లు 34 తెగాయి. ఎవరంటే ఎవరూ మాట్లాడరు!" అన్నాడు కండక్టరు.

రంగడికి భయమేసింది మళ్ళీ. తన టిక్కెట్టు జేబులోంచి చటుక్కున తీసి చూసుకున్నాడు. 'లేకపోతే ఇక్కడ కూడ అంతా చేరి తననే దొంగవెధవ అని తిట్టవచ్చును. ఏముంది? చిన్న కుర్రాడిని చూస్తే అందరికీ లోకువే! అనవసరంగా కొంచెం పెద్దయిపోయాడు తాను. చక్కగా నానిగాడంటే ఉంటే, అంతా ఎంచక్కా తననే ముద్దు చేసేవారు! పెరిగిపోయాడు తొందరపడి! పోనీ ఎంచక్కా బాబాయంత పెద్దయినా బోల్డు ఫ్రెండ్సు చేరి గౌరవిస్తారు. ఎటూ కాకుండా తయారయాడు తాను! 14 ఏళ్ళు ఛీ! ఛీ!' అనుకున్నాడు. ఇంతలో కండక్టరు తన దగ్గర కొచ్చాడు. టిక్కెట్టు చూపించాడు. ముందుకు వెళ్ళిపోయాడు కండక్టరు.

"ఏమయ్యోయ్! యింటికెళ్ళి పట్టె మంచం మీద పవ్వళిద్దువుగాని, లే. లే. టిక్కెట్టు చూపించు," అంటూ ఓ నలభై యేళ్ళవాడ్ని లేవగొట్టాడు కండక్టరు. ఆ మహానుభావుడు కళ్ళు నలుపుకుంటూ "యాంది? టిక్కెట్టా? యాడిదీ," అంటూ వింతగా చుట్టూ చూశాడు.

"ఇదండీ రకం! రాత్రి తెల్లవార్లూ సినీమాలూ గట్రా చూడ్డం! ఫస్టు బస్సులోపడి నిద్రోవడం!... టిక్కెట్టుకూడాకొనకుండాఎక్కడం!" అంటూ ప్రయాణీకుల నుద్దేశించి పలికాడు కండక్టరు!

"అంతేనండీ! ... అడక్కపోతే టిక్కెట్టు డబ్బులు కలిసొస్తాయని యిలా చేస్తుంటారు," అన్నాడో పెద్దమనిషి, కండక్టరుకు వత్తాసు పల్కుతూ! దాంతో నలుగురూ ఆ నిద్ర లేచిన వాడికి మంగళహారతు లిచ్చారు. కండక్టరు ఆతనికి టిక్కెట్టు కొట్టి రైటు చెప్పాడు. బస్సు మళ్ళా కదిలింది ఈ ఘట్టం పూర్తి కాగానే మళ్ళా ఓ సారి బస్సంతా కలియచూశాడు రంగడు. రెండు జళ్ళ అమ్మాయి ఎందుకో ముసిముసిగ నవ్వుకుంటోంది. బహుశా ఆ పల్లెటూరి రైతు టికెట్టు కొనకుండా నిద్రపోతున్నందుకేమో! వదినకూడ అప్పుడప్పుడూ అలాగే అందంగా నవ్వుతుంది. వదిన...వదిన పేరు గుర్తుకు రాగానే మళ్లా ఒళ్ళంతా వణికింది రంగడికి. అస లింతకూ తన గురించి వదినావాళ్ళు ఏమనుకుంటున్నారో! అన్నయ్య ఏమనుకుంటున్నాడో! అసలు తనకోసరం వెతికిస్తారా? లేక వాళ్ళే వెతుకుతున్నారా? ఏమైనా సరే! ఇక ఆ యింటికి వెళ్ళేది లేదు. అందుకేగా నిన్న సాయంత్రం




స్కూలు విడిచిపెట్టగానే సత్యం యింటికి పోయింది. సత్యం ఇల్లు ఎంత బాగుంది! పెద్ద డాబా! ఇంట్లో ఒక్కొక్కరికి ఒక్కొక్క గది. సత్యం చదువుకునే గది ఎంత చక్కగా ఉందో! పుస్తకాలకు బీరువా! కూర్చుని చదువుకునేందుకు డ్రాయరు-కుర్చీ-పైన ఫాను-టేబులు లైటు-దాహమైతే ప్రక్కనే మంచినీళ్లు-ఆకలైతే అలమారాలో బిస్కట్లు-ఆకలి సంగతి గుర్తుకు రాగానే రంగడి కడుపులో ఆకలేసింది. కాఫీ అన్నా తాగలేదు ఆరోజు! ఈసారి బస్సు ఆగి:ప్పుడు యిరవై పైసలతో కాఫీ తాగా లనుకున్నాడు. సత్యం నిన్న సాయంత్రం కనబడగానే సినీమాకు తీసికెడతానన్నాడు. తనే వద్దన్నాడు. వెళ్ళివా బాగుండేది. మళ్ళీ ఎన్నాళ్ళకు సినీమా చూస్తాడో! తన సంగతంతా చెప్తే సత్యం జాలిపడ్డాడు. రాత్రి సత్యం ఇంట్లోనే భోజనం-తెల్లారకుండా లేచి వచ్చేశాడు తాను. సత్యాన్ని అడిగి తీసికొన్న రూపాయతో బస్సు స్టాండు చేరాడు. నిన్న సాయంత్రం నుంచీ యింటికి రాకపోతే అన్నయ్య వదిన తన కోసం ఖంగారుపడే ఉంటారా? లేకపోతే పోతేపోయాడు, పీడ విరగడయిందని సంతోషించారా? ఆ మధుగాడు-వాడే-వదినతమ్ముడు, వాడేమనుకొంటున్నాడో? ఎవ రేమనుకుంటే తన కేం? ఇక ఆ యింటికి మళ్ళా వెళ్ళేది లేదు.

"కాఫీలు తాగేవాళ్ళు తాగచ్చు." అంటూ అరిచాడు కండక్టరు ఆ మాట వినిపించేసరికి రంగడు జేబు తడిమి చూసుకున్నాడు. యిరవై పైస లున్నాయి కాఫీ 13 పైసలు తప్పితే 15 పైస లుంటుంది. ఫర్వాలే

దనుకున్నాడు. బస్సు దిగి హోటల్లోకి వెళ్ళాడు. ఆ హోటల్లో ఎదురుగా బల్లమీద అన్నయ్యావాళ్ళ ఆఫీసరు కనబడ్డాడు. రంగడు వణికిపోయాడు. తనని గుర్తుపట్టి ఎక్కడికి వెడుతున్నావని అడిగేస్తాడేమో నని, తల వంచేసి కొని గబగబా ప్రక్కకెళ్ళిపోయి రెండోవైపుకు తిరిగి కూర్చున్నాడు. ఆఫీసరుగారు ఎటో చూస్తూ సిగరెట్టు కాలుస్తున్నారు. ఎందుకనో, సిగరెట్టంటే తనకి అసహ్యాం! సత్యం సిగరెట్లు అడపాతడపా కాలుస్తూనే ఉంటాడు.

"రెండు పెసరా, ఓ స్ట్రాంగు కాఫీ" అంటూ అరుస్తూ తన దగ్గర కొచ్చాడు సర్వరు. ప్రక్కబల్లమీద ఓ పెద్దమనిషి యిడ్లీ సాంబారు కలిసి కొట్టేస్తున్నాడు. రంగడికి యిడ్లీ సాంబారు చూడగానే తానూ తినాలని అనుకున్నాడు. మళ్ళీ జేబులో పైసలు చూసుకున్నాడు. ఇరవై. ఇడ్లీ తింటే కాఫీకి చాలవు. ఈ హోటల్లో కాఫీ ఎంతో బోర్డున్నా లేదు – ఏ దేంత ఖరీదో తెలుసుకోవటాన్కి:

"ఏం కావాలి?" అన్నాడు సర్వరు రంగడ్ని.

"కాఫీ యెంత?" అని అడిగేడు రంగడు.

సర్వరు ఆశ్చర్యపోయాడు. వాడికి తన తొలిరోజులు గుర్తుకొచ్చాయి. తానా హోటల్లో సర్వరుగా చేరేముందు ఓనాటి ఉదయం యిలాగే కాఫీకి వచ్చి జేబులో డబ్బులు గట్టిగా పట్టుకుని ముందు కాఫీ ధర అడిగి తెలుసుకుని, మరీ కాఫీ త్రాగాడు. రంగడ్ని చూసేసరికి సర్వరుకు జాలేసింది.

"ఏం? నీ దగ్గర డబ్బు లెన్ని ఉన్నాయి?"

"ఇరవై పైసలు" ఠక్కున చెప్పాడు రంగడు.

"అయితే ఓ యిడ్లీ సాంబారు తిని, కాఫీ త్రాగు," అన్నాడు సర్వరు.

"సరే అలాగే యివ్వు," అన్నాడు సంతోషంగా రంగడు.

అంతే! వెంటనే క్షణంలో రంగడి యెదురుగ ప్లేటులో సాంబారులో మునిగిపోయిన అరయిడ్లీ, పైకి తేలుతున్న యిడ్లీ ఒకటి ప్రత్యక్షమయినై. రంగడికి అర్ధంకాక సర్వరు కేసి చూశాడు. 'తినేయ్ త్వరగా' అన్నట్టు చూశాడు. గబగబా చెంచాతో తీసికొని తినేశాడు రంగడు. కడుపునిండా గ్లాసెడు నీళ్ళు త్రాగేశాడు. ఇంతలో గ్లాసుతో కాఫీ యిచ్చాడు సర్వరు. కాఫీకూడా త్రాగాడు. బస్సు హారన్ మ్రోగింది.

"ఇరవై పైసలు," అంటూ అరిచాడు సర్వరు. రంగడు బిల్లు చెల్లించేశాడు. బస్సులో కూర్చున్నాడు. బస్సు

మళ్ళీ బయలుదేరింది. కడుపు నిండిన సంతోషంతో గతదినం జరిగిన ఘట్టం మర్చిపోసాగాడు రంగడు. ఏమైతేనేం, అన్న వదినల బందిఖానాలోంచి బైట పడ్డాడు తాను. ఒక్క అరగంటలో వాళ్ళ ఊరు రానే వచ్చింది. ఏదో దిగులుగా, గుండెల్లో గుబులుగా బస్సు దిగాడు. ఏదో చేయరాని నేరం చేసి నట్లు బాధపడసాగాడు.

భయంభయంగా చుట్టూ చూశాడు. దుమ్ము లేపుకుంటూ బస్సు ముందుకు సాగిపోయింది. తిన్నగా ఇంటికి వెళ్లాడు. నాన్న ఇంట్లో లేడు. అమ్మ దొడ్లో పన్జేసుకుంటోంది. అమ్మ దగ్గర కెళ్ళి ఒక్కసారి బావురుమన్నాడు. "ఇంక నే నా ఊరికి వెళ్ళనమ్మా!" అంటూ అమ్మను గట్టిగా కౌగలించుకున్నాడు. "పోన్లేరా నాయనా! అంత బాధగా ఉంటే వద్దులేరా," అంది ఆ తల్లి, మాతృప్రేమతో. ఆ వాత్సల్యం ఆస రాతో తన గోడు అంతా చెప్పేశాడు తల్లితో! తల్లి కళ్ళనీళ్ళు వత్తుకుంటూ, ఆ తనయుడ్ని హృదయానికి హత్తు కుంది. ఇంతలో తండ్రి వచ్చాడు. అంతా పిల్లుల్లా ఎక్కడివాళ్ళక్కడే సర్దుకున్నారు. రంగడి సంగతి సరేసరి- బిక్క చచ్చిపోయిన ముఖంతో తలుపు చాటుకు చేరాడు.

"వీ డెప్పు డొచ్చాడు?" అన్నాడు తండ్రి!

"ఇప్పుడే బస్సులో దిగాడు." అంది తల్లి భయపడుతూ నూతిలో గొంతులా.

"ఏం? పరీక్ష లవలేదుగా ఇంకా! ఎందు కొచ్చాడు?" అంటూ గర్జిం చాడు తండ్రి!

'నా కింకేం పరీక్షలు నాన్నా! నే నింక అక్కడ ఉండను!' అని చెప్పేద్దా మనుకున్నాడు రంగడు. కాని నోట్లోంచి మాట పెగల్లేదు.

"అక్కడ కోడలు ఏదో అన్నదిట పిడ్ని. అందుకని-" అంటూ ఏంచెప్పాలో తెలియక ఆగిపోయింది తల్లి భయ పడుతూ.

"ఏమిటి? అయితే వాళ్ళతో చెప్ప కుండ వచ్చాడన్నమాట. ఏరా! వెధవా! యిలా రా!" అంటూ తలుపు ప్రక్కనున్న రంగడ్ని జుట్టు పుచ్చుకుని ఒక్కలాగు లాగాడు తండ్రి! రంగడి పై ప్రాణాలు పైనే పోయినై. ఆ రోజు తండ్రి ఇక తనని చంపే యడం ఖాయ మనుకున్నాడు.

"వెధవా! చదువుకోమని పంపిస్తే ఇలా దొంగవేషాలు వేసి చెప్పకుండా వచ్చేస్తావా! ఉండు! నీ తాట వలిచే స్తాను. జాగ్రత! నాల్గు మెతుకులు తిని పడుకో. సాయంత్రం బస్సుకి నేను దిగబెట్టివస్తాను," అంటూ తండ్రి తన పని చూసుకుందుకు వెళ్ళిపోయాడు. రంగడు బావురుమన్నాడు, మళ్ళీ తల్లి మీద పడి! ఆ తల్లి మాత్రం ఏం

చేస్తుంది? ఆ ఇంట్లో ఆ తండ్రికి ఎదురు చెప్పే ధైర్యం, సాహసం ఎవరికీ లేదు. ఆయన ఎంతంటే అంతే! తల్లి భయం చూసి రంగడు జాలిపడ్డాడు. తనకోసం పాపం తల్లి తిట్లు తింటుం దేమో నని భయపడ్డాడు. నాన్నెంత యీ ఇంట్లో అమ్మకి బాధలు! ఏది సంతే ఆ ఇంట్లో అన్నయ్యకు బాధలు! ఏమిటో యీ వింత! ఏమైతే నేం? మళ్ళీ తా నా జైల్లోకి వెళ్ళక తప్పదన్న మాట! వెళ్ళనని గట్టిగా మొరాయిస్తే! అమ్మో! ఇంకేమన్నా ఉందా! నాన్న చంపేయడు మరి. యీ విషయం నిన్నెందుకు ఆలోచించలేదు? ఏమిటో తెలివితక్కువతనము! నిన్న ఆ సమయంలో తన బుర్ర పనిచేయ లేదు. ఏడుస్తూ పడుకున్నాడు రంగడు. వెంటనే ఆ క్రితంరోజు జరిగిన ఘట్టం కళ్ళముందు కదిలింది.

* * *

"మధూ! మధూ!" వదిన పిలుస్తోంది—తమ్ముణ్ణి గాబోలు.

"పిలిచావా! వదినా?" అంటూ రంగడు వచ్చాడు.

"మధూ అంటే నువ్వా? అయిన దానికీ, కానిదానికీ పిలిచావా అంటూ తయారవుతా వెందుకు?" అంటూ ఈసడించుకుంది వదిన. వెంటనే రంగడు బిక్కమొహంతో అక్కడి నుంచి వెళ్ళిపోయాడు.

"ఛీ! ఛీ, యీ ఇంట్లో ఒక్క వస్తువూ జాగ్రతగా ఉంటుందని నమ్మకం కలగడం లేదు. ఇవ్వాళ మూడు రూపాయలు పోతే రేపు ముప్పై రూపాయలు పోతాయి. ఇంటి దొంగను ఈశ్వరుడైనా పట్టగలడా?" అంటూ ప్రారంభించింది వదిన దాడి. అప్పుడే అన్నయ్య ఆఫీసునుంచి కాఫీకి గాబోలు ఇంటికొచ్చాడు.

"ఏమిటి వెతుకుతున్నావు జానకీ!" అన్నాడు అన్నయ్య.

"ఏముంటుంది? కొంపలో దొంగ తనాలు బయలుదేరితే, ఇక రోజూ దేన్నైనా వెతుక్కోవాల్సిందేగా మరి," అంది కోపంగా!


"ఇంతకూ ఏం పోయింది?"

"ఏదైనా పోతే అనుకోవట మెందుకు? పనిమనిషి కివ్వాలని పెట్లో మూడు రూపాయలు పెట్టాను—ఎవరు తీశారో ఏమో! వాడేమో ఇందాక కాలేజీ కెడుతూ 'ఓ రూపాయి ఉంటే ఇవ్వవే అక్క' అని అడిగాడు. పాపం, వాడి మతిలో పెద్దామంటే ఏదీ! ఏమై పోయాడో ఏమో!" అంది వదిన.

అంటే ఇంట్లో ఇక మిగిలింది తనేగా! తానే తీశానని ఆవిడ ఉద్దేశం.

"అయితే ఎవరు తీసుకుంటారే!" అన్నాడు మెల్లిగా అన్నయ్య.

ప్రక్కనే వున్న తన కేసి చూశాడు.



"నువ్వేమన్నా తీశావేంరా?" అన్నాడు. తన నెత్తిమీద పిడుగు పడ్డట్టయింది.

"నేను తీయలేదన్నయ్యా!" అన్నాడు తను.

ఇంతలో వదినే అందుకున్నది. "ఇంకా నెమ్మదిగా తీశావేంరా అంటారేం? నాలుగు తగిలించి ఎక్కడ పెట్టాడో తెమ్మనక!" అంటూ అన్నయ్యను గదమాయించింది.

"ఏరా నిజం చెప్పు!" అన్నాడు అన్నయ్య.

"మీరు మరీను—నెమ్మదిగా అడిగితే చెప్తాడా! మీకు చేతగాకపోతే మానేయండి. నేనే చూస్తాను ఆ సంగతి! ఇవ్వాళ ఇది అయింది, రేపు ఇంకెంత తీస్తాడో!" అంటూ తనకేసి కళ్ళురిమి చూసింది. దాంతో తన మనస్సు విరిగిపోయింది. ఇక ఆ కొంపలో తన మాట వినేవాళ్ళు లేరు. అందుకేగా ఆ ఇల్లు వదిలేసి వచ్చేసింది.

* * *

వాళ్ళమ్మ లేపి అన్నం పెట్టేదాకా రంగడికి తెలియనే లేదు—తాను నిద్ర పోయానని. అమ్మ చేత్తో పెట్టిన అన్నం కడుపునిండా తిని తృప్తిగా త్రేన్చాడు ఆ పూట—మళ్ళీ ఆ రాత్రికి ఎలాంటి తిండి తినాల్సివస్తుందో నన్న బాధతో!

ఇంతలో మధ్యాహ్నం ప్రయాణ మయ్యాడు తండ్రి—తనను తీసికొని వెళ్ళి అన్నయ్యదగ్గర దిగవిడిచి రావడానికి—తన ప్రాణం చిక్కచచ్చిపోయింది. చచ్చినా యిక ఆ గడప త్రొక్కనని

శపథం చేయకపోయినా, శపథం చేసినదానికన్న ఎక్కువగా చెప్పకుండా విడిచిపెట్టేసిన యింటికా మళ్లా వెళ్ళటం! యెంత లజ్జాకరం! యెంత బాధాకరం!– తండ్రి కెదురుచెప్పలేక తల వంచుకొని బయలుదేరాడు–తల్లి కేసి బిక్కమొహం చూపు చూస్తూ! 'నే నేం చేయగలను నాయనా? నా బ్రతు కింతే,' అన్నట్టు జాలిగా చూసింది, ఆ తల్లి కళ్ళొత్తుకుంటూ!


"నడు, నడు. బస్సు వచ్చే టైమ్ ఐంది." అంటూ తండ్రి తొందరచేసి తీసికొనిపోయాడు. ఈసారి ప్రయాణం మరింత భయంగా ఉంది రంగడికి. సాయంత్రం ఆరయేసరికి యింటికొస్తున్న తండ్రీకొడుకుల్ని చూసి ఆశ్చర్యపోయారు రంగడి అన్నయ్యా, వదినలు.

"ఇంటికొచ్చాడా నాన్నా? నాతో చెప్పనన్నా లేదే. నేనే పంపించేవాణ్ని." అన్నాడు రంగడి అన్నయ్య.

"అయ్యో! మనతో యెందుకు చెప్తాడు? చేతిలో డబ్బులున్నాయిగా–వెళ్ళిపోయాడు," అంటోంది వదిన–యింకా ఆ మూడురూపాయలు తానే తీశాననే నమ్మకంతో! అన్నట్టు ఈ ప్రయాణానికి సత్యం యిచ్చిన రూపాయి ఆ మూడురూపాయల్లోది కాదని ఆవిడకు నచ్చచెప్పడం ఎలాగ? రంగడు బుర్ర క్రిందకు దించేశాడు.

ఆ రాత్రే తండ్రి తిరిగి యింటికి వెళ్ళిపోయాడు. ఈసారి వదినకు మరింత లోకువయిపోయాడు రంగడు. చీటికీ మాటికీ చిత్రహింస పెట్టసాగింది. ఆవిడ తిట్లకూ చీవాట్లకూ అలవాటు పడిపోయాడు. ఎన్నియాతనలు పడుతున్నా చదువుమాత్రం అశ్రద్ధ చేయలేదు రంగడు. చదువుకునేందుకు టైము లేకపోయినా ఉన్న టైములోనే చదివి పాసయ్యాడు. వదిన తమ్ముడు మధు మళ్ళీ P. U. C. లోనే చేరాడు. హైక్లాసు చదివే యోగ్యత కలగనందున.

రోజులు గడుస్తున్నకొద్దీ రంగడు గ్రహించిన విషయాలు కొన్ని ఉన్నాయి. ఎంత కష్టమయినాసరే భరించడం నేర్చుకుంటే యిక జీవితంలో జయించరానిదంటూ ఏం లేదని. అంతే! కాలచక్రం క్రిందపడి రెండు మూడేళ్లు నలిగిపోయాయి. మధు యింకా ప్రైవేటుగా P. U. C. కట్టొస్తూనే ఉన్నాడు. అతని తమ్ముడు కూడా అక్కడే చేరాడు. అతను స్కూలు ఫైనలు పాసయ్యాడు. రంగడు స్కూలు ఫైనలు పరీక్ష కెళ్ళాడు. రంగడికి యింకా చదవాలనిఉన్నా, వదిన ప్రోద్బలంవల్ల చదువు మాన్పించటానికే నిశ్చయమైంది. ఈ విషయం పసిగట్టిన రంగడు యిక ఆ యింట్లో తన కే విధమైన స్థానమూ లేదని




గ్రహించాడు. తిరిగి యింటికి వెళ్ళడం తెలివితక్కువనికూడ. యిదివరకే అర్థమయింది. అందుకే యీసారి అన్నయ్యతోనే చెప్పి బయలుదేరాడు.

"అన్నయ్యా! యిక నేనీ యింట్లో ఉండలేను. ఎక్కడికో వెళ్ళిపోతున్నాను," అన్నాడు రంగడు.

"యెక్కడికిరా ?" అన్నాడు అన్నయ్య.

"పోతే పోనీయండి! మాట్లాడితే పోయేవాళ్ళని యెవరాపుచేస్తారు ? ఇంతకాలం మనం పెట్టిన తిండి యెక్కసం అయిందిగాబోలు!" అంటూ ఓ విసురు విసిరింది వదిన.

రంగడు మౌనమే సమాధానంగా యిచ్చాడు.

"పోనీయండి! వీధుల వెంట అడుక్కుతింటాడేమో !" అని ఆఖరిసారిగ ఆశీర్వదించింది వదిన.

ఏమైతేం? ఈసారి రంగడు స్వేచ్ఛా ప్రపంచంలోకి పడ్డాడు. ఏం చేయడానికి తోచలేదు. ఎక్కడికి పోతాడు ? తిండి ఎవరు పెడ్తారు ? తిరిగాడు, తిరిగాడు. చివరకు ఓ హోటల్లో సర్వరుగా చేరాడు. మొదట్లో సిగ్గనిపించింది - ఆ ఊళ్ళోనే చదువుకున్న కుర్రాళ్ళ ముందు సర్వరుగా చేయటాన్కి ? కాని తర్వాత తర్వాత అలవాటయిపోయింది. రంగడిమీద జాలికల మిత్రులంతా ఆ హోటలుకే వెళ్ళసాగారు దాంతో ఆ హోటలు ఫైలు క్రమక్రమంగా పెరుగసాగింది. హోటలు బేరాలు ఎక్కువయ్యాయి. కొద్దికాలంలోనే హోటలు పెద్దదయింది. ఎక్కువ

లాభాలు సంపాదించింది. ఆ నోటా ఆ నోటా విన్నాడుకాని, రంగడి అన్నయ్య, కళ్ళారా అంతవరకూ తమ్ముడ్ని సర్వరుగ చూడ లేదు. ఓనాటి ఉదయం కాఫీ తాగుదామని ఆ హోటలుకే వెళ్ళాడు. "ఏం కావా లండీ?" అంటూ ప్రత్యక్షమయిన తమ్ముడ్ని చూసి కొయ్యబారి పోయాడు. తన తల కొట్టేసినంత బాధపడి, వెంటనే రంగడ్ని జబ్బపుచ్చు కుని బరబరా లాక్కుపోసాగాడు. ఈ హడావిడికి హోటలు ప్రొప్రయిటరు వచ్చి రంగడ్నీ, అతని అన్నయ్యనూ సమాధానపర్చి, ఏమైనాసరే రంగడ్ని విడిచిపెట్టేది లేదన్నాడు.

"వాడి కేం ఖర్మండీ! ఈ సర్వ రుగా చేయడాన్కి?" అన్నాడు రంగడి అన్నయ్య. "మా వంశప్రతిష్ట మంటగలిపేస్తున్నాడు."

"అయ్యా! ఈ కుర్ర వాడు యిక్కడ యెంత గౌరవం పొందు తున్నాడో మీకు తెలీదు. ఈ హోటల్లో నాకన్నా అతనంటే ఎక్కువ ప్రేమ చూపిస్తున్నారు మా కస్టమర్సు. అత నొచ్చాక మా బిజినెస్ పెరిగింది," అన్నాడు ప్రొప్రయిటరు.

"మీ బిజినెస్ పెరుగుతోందని మా వాడ్ని సర్వరుగా ఉండమంటారా?" అంటూ కోపం చెందాడు రంగడి అన్నయ్య.

"నా వల్ల మీ ప్రతిష్ట పోతుంటే నే నీ సర్వరుపని మానేస్తా లే అన్నయ్యా!" అన్నాడు రంగడు.

అక్కడితో రంగడి అన్నయ్య మెత్తబడి వెళ్ళిపోయాడు. అంతే కాని యింటికి తిరిగి రమ్మనమని అనలేక పోయాడు భార్యకు జడిసి. ఇంటిదగ్గిర తండ్రికీ విషయం తెలియ చేద్దామంటే ఆ యోగ్యతకూడా లేకుండా-అనుకో కుండా క్రితం యేడాదే ఆయన కాలం చేశాడు. ఇక వాడి ఖర్మ వాడిదని ఊరుకున్నాడు.

రంగడి మంచితనం చూసి, ఆ ప్రొప్రయిటరే, తన తమ్ముడి మందుల షాపులో గుమాస్తా ఉద్యోగం యిప్పిం చాడు. రంగడి అదృష్టం అక్కడా అలాగే ప్రకాశించింది. మంచితనానికి మించిన ఐశ్వర్యం మానవుడికి మరొ కటి ఉండదనే మహత్తర సత్యాన్ని రంగడి జీవితం ఋజువు చేస్తోంది. రంగడికి మందులషాపులో ప్రతి బీరువా పరిచయ మయిపోయాయి. డాక్టరు రాత అర్థం కాకపోయినా, సరైన మందు యిచ్చే స్థితికి వచ్చాడు. కొందరు పేదలు సరాసరి మందుల షాపుకే వచ్చి రంగడితో చెప్పి మందులు తీసికెడుతున్నారు. షాపు యజమాని యిచ్చే జీతం, హోటలు ప్రొప్రయి టర్ చూపే ఆదరం, భోజనం అన్నీ కలిసి రంగడ్ని మళ్ళీ ఓ మానవు

డిగా చేశాయి. కండలు తరిగిన దేహంతో చక్కగా తయారయ్యాడు రంగడు. షాపుకు దగ్గర్లో రూము తీసికొన్నాడు రంగడు. యజమాని యెడల విధేయతే రంగడి లక్ష్యం. కాలం కులాసాగా దొర్లిపోతోంది.

* * *

"సార్! యీ మందులు అర్జంటుగా యిప్పించండి! అవతల చాల ప్రమాదంగ ఉంది," అంటూ షాపులోకి ప్రవేశించాడో వ్యక్తి!

"అలాగే! కూర్చోండి!" అంటూ ఆ యజమాని బెల్లు మ్రోగించాడు. వెంటనే అక్కడి కొచ్చిన కుర్రాడికి ఆ చీటీ యిచ్చాడు. "అర్జంటుగా Pack చేయండి!" అన్నాడు.

"కే సేమిటి సార్! Delivery కి వాడుతారే ఈ Tablets!" అన్నాడు షాపు యజమాని.

"అవునండీ! డెలివరీ కేస్! చాల Weak గా ఉన్నది. ఒంట్లో రక్తం లేదుట. Blood ఎక్కించాలంటున్నారు. Easy delivery అయ్యేట్టు లేదు. ఆపరేషను చేస్తే ప్రాణం పోతుందేమో నని భయంగా ఉంది. చేయకపోతే Delivery అయేసరికే ప్రాణం పోవచ్చు," అంటూ చెమట్లు కక్కుతున్నాడా వ్యక్తి.

"ఇదిగో సార్! Packet!" అంటూ కుర్రాడు Packet యిచ్చాడు.

"General hospital లో Admit చేయకపోయారా? అక్కడ Blood ఉంటుందిగా" అన్నాడు యజమాని బిల్లు రాసి యిచ్చి డబ్బు తీసకొంటూ!

"అక్కడే Admit చేశాము. అక్కడా Blood లేదు. ఇంకో అరగంటలోగా Blood ఎక్కించకపోయినా, Delivery కాకపోయినా Case లాభం లేదంటున్నారు," అంటూ కళ్ళనీళ్ళ పర్యంతమయి, ఆ వ్యక్తి యీసుకు వెళ్ళిపోయాడు.

అప్పుడే లోపల మందులు సర్ది వస్తున్న రంగడికి ఆఖరిమాటలు వినిపించాయి.

"ఏమిటి సార్?" అని అడిగాడు యజమానిని.

"పాపం! ఎవరో అభాగ్యుడు," అంటూ యజమాని అంతా చెప్పాడు. రంగడి బుర్ర పనిచేయలేదు. ఆ వెళ్ళిన వ్యక్తి అన్నయ్యలా ఉన్నాడు. అవునా? కాదా? అనుమానం. "పేరేమిటన్నాడండీ!" అనుమానం తీరక అడిగాడు రంగడు. Bill book లో పేరు చూపించాడు రంగడికి. రంగడి హృదయం కల్లోలమైపోయింది. కాళ్ళూ చేతులూ వణికిపోయాయి. "సార్! ఒక్క అరగంటలో వచ్చేస్తాను," అంటూ బాణంలా దూసుకుపోయాడు రంగడు. ఏమిటో అర్థం కాక తెల్లబోయి చూడసాగాడు యజమాని.

"సారీ! Mr. రాజారావ్! మేమేం Help చేయలేం! Blood కోసం ఫోను చేశాం. ఇంకో అయిదు నిముషాల్లో వస్తే అదృష్టవంతులం. ఈ లోగా ఎవరన్నా Blood యిస్తే బాగుండును," అన్నాడు డాక్టరు.

"నా Blood పనికి రాదంటున్నారు. మరి ఎవరిస్తారు యీ రాత్రి సమయంలో," అంటూ నీరసంగా కూలిపోయాడు రాజారావు - రంగడి అన్నయ్య! ఈ గందరగోళం చూసి మధు తన రక్తం యెక్కడ యిమ్మంటారో నని చల్లగా జారుకోసాగాడు

"నీ Blood సరిపోతుందేమో చూస్తానంటున్నారు మధూ!' అన్నాడు రాజారావు.

"అమ్మో! నా రక్తమే! యింకేమన్నా ఉందా? నేనింకా Medicine చదవాలి! రక్తం తగ్గిపోతె ఎలా?" అంటూ అక్కడినుంచి పారిపోయాడు మధు.

"అయితె ఈ మెగతి" అంటూ కళ్లు తిరిగి పడిపోయాడు రాజారావు! రాజారావుకు First aid ... మని నర్సుకు ఆర్డరిచ్చాడు డాక్టరు. గడియారం కేసి బాధగా చూడసాగాడు డాక్టరు. Blood ఇంతవరకు రాలేదు.

"డాక్టర్, నా రక్తం సరిపోతుందేమో చూడండి!" అంటూ సుడిగాలిలా ప్రవేశించాడు రంగడు. వెనకాల Watchman తరుముకొస్తున్నాడు. డాక్టరు ఆశ్చర్యానందాలతో రంగడికేసి చూశాడు.

"త్వరగా సార్! త్వరగా! నా రక్తం తీసుకోండి! అవిడ్ని రక్షించండి!" అంటూ తొందర చేశాడు. డాక్టరు ఆనందంతో రంగడి రక్తం test చేశాడు. అదృష్టం సరిపోయింది. గుమ్మం దగ్గర కొచ్చిన Watchman గుమ్మం దగ్గరే గుడ్లప్పజెప్పి చూడసాగాడు. అంతే! క్షణంలో రంగడి రక్తం, రంగడి వదిన శరీరంలోకి ఎక్కించబడింది. పేషెంటు కదిలింది. శక్తి పుంజుకుంది. సుఖప్రసవమైంది. మగపిల్లాడు. నీరసంగా కళ్ళు తెరచి ప్రక్కలోనున్న బిడ్డను చూసి ఆనందంతో ఉప్పొంగిపోయింది ఆ తల్లి. నీరసంగా బల్లమీదనుంచి దిగిన రంగడు, వదిన ప్రక్కలో పసిపాపడ్ని చూసి, ఆనందంతో రెండు కన్నీటిచుక్కలు రాల్చాడు. రంగడి పేరు రిజిష్టరులో నమోదు చేశారు. అంతే! ఆగమన్నా ఆగకుండా వెళ్ళిపోయాడు రంగడు.

"Mr. రాజారావ్! నువ్వు చాల అదృష్టవంతుడివోయ్! లే, లే," అంటూ నెమ్మదిగా రాజారావుని లేపాడు డాక్టరు.

"అయిపోయింది. అంతా అయిపోయింది. నా జానకి బూడిదైపోయింది," అంటూ బావురుమన్నాడు రాజారావు.



"అదేం మాటయ్యా! నీకు మగ పిల్లవాడు. నీ అదృష్టం గొప్పది. నీ wife safe గా ఉంది," అన్నాడు డాక్టరు.

ఆఁ, నిజమా!" అంటూ గదిలోకి పరుగెత్తాడు రాజారావు. పక్కమీద నిద్రోతున్న పసివాడ్నీ, ప్రక్కనే పడుకుని నీరసంగా చూస్తున్న జానకినీ చూసిన తర్వాతగాని రాజారావుకు అర్థం కాలేదు. అంతవరకూ తాను కలగంటున్నానని-కలలో జానకి మరణించినట్లు, శ్మశానికి తీసికెళ్ళినట్లు-దహన సంస్కారాలు చేసినట్లు-అంతా పీడకల—అనుకొన్నాడు

"ఇంతకూ నా wife కు రక్తదానం చేసిందెవరు డాక్టర్?" అన్నాడు రాజారావు.

"ఎవరో పద్దెనిమిదేళ్ళ కుర్రాడు. ఆఖరి సమయంలో, ఆ దేవుడే ఆ రూపంలో వచ్చి రక్తం ఇచ్చి వెళ్ళిపోయాడు. పేరు రిజిష్టరులో రాయాలని పట్టుబడితే, రంగడని చెప్పాడు," అంటున్నాడు డాక్టర్.

'రంగడా! నా తమ్ముడు రంగడా!' అంటూ కొయ్యబారిపోయాడు రాజారావు.

"ఛీ, ఛీ, ఆ దొంగవెధవ రక్తమా నాకు ఎక్కించినది?" అంటూ సణుగుతోంది జానకి.

డాక్టరుకు ఇదేం అర్థంకాలేదు.

"తప్పమ్మా, తప్పు. ఆతను దొంగ వెధవో మంచివెధవో మన కనవసరం. కాని మానవత్వంగల మనిషి. లేక పోతే, మీతమ్ముడ్ని రక్తం ఇమ్మంటే యీ చాయల్లో లేకుండా పోయాడు," అన్నాడు డాక్టరు,

మొత్తానికి రంగడి రక్తదానంతో రాజారావు సంసారం నిలిచింది. జానకి మళ్లా భూమ్మీద బతికి బట్టకట్టింది. పది రోజులనంతరం పండంటి మగపిల్లాడితో సహా జానకి హాస్పటలునుంచి యింటికి చేరింది. ఆ బిడ్డ కలిగిన వేళావిశేష మేమిటో కాని రాజారావుకు అదృష్టము కలిసివచ్చింది. ఆఫీసులో మేనేజరు ప్రమోషను వచ్చింది. ఏడాది తిరక్కముందే ఆదాయంలో మార్పు వచ్చింది. కలిసివచ్చే కాలంలో అన్నీ అట్లాగే వస్తాయి అయిదేళ్ళలో అనుకోని మార్పులు కలిగాయి. ఈ నాడు రాజారావే ఒక స్వంతకంపెనీకి అధికారి. జానకి అదృష్టం సరేసరి!

అయిదేళ్ళ తర్వాత ఒక నాటి ఉదయం రాజారావు యింటినిండా జనం కిటకిట లాడిపోతున్నారు. క్రొత్త డాబా గృహప్రవేశం, కొడుక్కు అక్షరాభ్యాసం అనాడే! ఎక్కడెక్కడి బంధువులు వస్తున్నారు. ప్రాణంపోయే అక్కగార్కి అవసరంలో అరఔన్సు రక్తం యివ్వడాన్కి జడిసిపోయిన మధు, యీనాటి కోలాహలానికి అంతకూ పెత్తనం వహిస్తున్నాడు.

* * *

"రంగా! షాపు జాగ్రత! రాజారావుగా రింటికి వెళ్ళివస్తాను," అంటూ రంగడి చేతికి తాళాలు యిచ్చి బయలు దేరాడు ఆ మందులషాపు యజమాని! ఈ అయిదేళ్ళలో రంగడిలో వచ్చిన మార్పల్లా ఒక్కటే-అది ఉద్యోగంలో! గుమాస్తాగా చేరిన రంగడు యిచ్చే జీతం నిలవచేసికొని షాపులోనే వాటా దారుగా చేరాడు. అంతే!

యజమాని వెళ్లిపోగానే కుర్చీలో కూర్చున్న రంగడికి డ్రాయరు మీద ఎదురుగా యజమాని పేర నున్న శుభ లేఖ - తన అన్నగారు పంపినది-తనను చూసి వెక్కిరిస్తున్నట్లుగా కనిపించింది.

"చూశావా! ఆనాడు నువ్వు రక్తం యిచ్చిఉండకపోతే యీనాడు నీ అన్న కంత అదృష్టం, అయిశ్వర్యం కలిగేవా! కనీసం నిన్ను తలచనన్నా తలచడే-విశ్వాసఘాతకుడు," అంటూ ఎవరో ఎక్కడో తన హృదయం లోంచి పలుకుతున్నట్లనిపించింది.

"అలాంటి వాళ్ళకు ప్రాయశ్చిత్తం వెంటనే ఏ అఘాయిత్యమన్నా జరిగితే కాని కుదరదు," అంటూ ఏవరో అన్నయ్యను శపిస్తున్నట్లనిపించింది రంగడికి.

"వద్దు! వద్దు!. అన్నయ్యకు ఏ ఆపదరాకూడదు. అన్నయ్య అమాయకుడు. భగవంతుడా! వాళ్ళకేం ప్రమాదం రాకుండ కాపాడు తండ్రీ!" అంటూ ఎదురుగ ఉన్న వెంకటేశ్వర స్వామి విగ్రహంకేసి చూసి నమస్కారం చేశాడు. అప్రయత్నంగా ఆతని కళ్ళ వెంట రెండు కన్నీటిచుక్కలు రాలి ఆ శుభలేఖపై పడ్డాయి.